క్లుప్తంగా

నేడు బీసీ కుల సంఘాలతో సమావేశం

కాజీపేట అర్బన్: హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్‌లో బీసీ కుల సంఘాలతో సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు బీసీ వెల్ఫేర్ డీడీ రామ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ నగరంలో పర్యటించనున్న సందర్భంగా బీసీ కుల సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీ కులాల ప్రతినిధులు రాజకీయ, సామాజిక, ఆర్థిక సమస్యలపై అభ్యర్థనలు, సలహాలు స్వీకరించి పలు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి బీసీ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని పేర్కొన్నారు.

ఎన్‌సీసీ యూనిట్ మంజూరు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ మంజూరైనట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. బాలికలకు మాత్రమే ఈ యూనిట్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ సంవత్సరం నుంచే ఎన్‌సీసీ ప్రారంభిస్తున్నట్లు వివరించారు. విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో విద్యార్థినులకు ఎన్‌సీసీ ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ఎన్‌సీసీ యూనిట్ మంజూరుపై ప్రిన్సిపాల్ సునీతతో పాటు ఎన్‌సీసీ యూనిట్ ఏఎన్‌ఓ సుమలత, కళాశాల అభివృద్ధి కమిటీ కోశాధికారి చకిలం రాజేశ్వర్‌రావు, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

సౌండ్ సిస్టమ్ బహూకరణ



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ఎల్లాపురం జిల్లా పరిషత్ పాఠశాలకు సౌండ్ సిస్టాన్ని బహూకరించారు. గ్రామానికి చెందిన గంగిళ్ల మధుసూదన్‌రెడ్డి, గోలి వెంకటరంగారెడ్డి కలిసి సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎర్ర ప్రకాష్, సునీల్, బాషబోయిన రాజన్ బాబు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

ఖిలా వరంగల్: ప్రభుత్వ డిగ్రీ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి.రాజన్న కోరారు. ఈమేరకు వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సూచించారు. ప్రతినెలా వేతనాలు అందజేస్తే అతిథి అధ్యాపకుల ఆర్థిక ఇబ్బందులు కొంతవరకు తొలగిపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎండీ.షరీఫ్‌పాషా, కోశాధికారి గీత, షమీనా పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేయొద్దు

వరంగల్: నిబంధనల పేరుతో రుణమాఫీలో రైతులకు అన్యాయం చేయవద్దని రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు ఒక ప్రకటనలో కోరారు. హనుమకొండలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన రైతు డిక్లరేషన్ బహిరంగ సభలో రాహుల్‌గాంధీ ప్రకటించిన విధంగా రూ.రెండు లక్షల రుణమాఫీ ప్రకటన రైతాంగాన్ని ఎంతో ఆకర్షించడంతో వారి ఓట్లతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. రుణమాఫీ నిబంధనలతో రైతులను ప్రభుత్వం మోసం చేస్తోందని తెలిపారు. రైతు డిక్లరేషన్‌లో పొందుపర్చిన విధంగా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సూచించారు.

భద్రకాళి పరపతి సంఘం ఎన్నిక



కాశిబుగ్గ: కాశిబుగ్గలోని శ్రీభద్రకాళి పరపతి సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం గోవాలో జరిగిన సంఘం 21వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా గుళ్లపల్లి (బాంబుల) రాజ్‌కుమార్ మళ్లీ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గోగికార్ కిరణ్‌కుమార్, కోశాధికారిగా మాటేటి విద్యాసాగర్, సహాయ కోశాధికారిగా సల్ల రాజేందర్ ఎన్నికయ్యారు. సమావేశంలో 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, డి.సంపత్, గోరంట్ల మనోహర్, సిద్దుజు శ్రీనివాస్, శివాజీ, గుత్తికొండ నవీన్, దయ్యాల ప్రభాకర్, వేముల నాగరాజు, బి.శ్రీనివాస్, జి.సత్యనారాయణ, సాంబశివుడు, పున్నమిచందర్, ములుక సురేష్, కె.ప్రభాకర్, కె.రాజు, కె.రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలి

కమలాపూర్ : ప్రతి ఇంటి ఆవరణలో తప్పనిసరిగా మరుగుదొడ్డి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు సూచించారు. మండలంలోని అంబాల, ఉప్పులపల్లి, ఉప్పల్, గుండేడు తదితర గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఉపాధి హామీ పనులను, స్వచ్ఛ భారత్ మిషన్ కింద చేపట్టిన పనులను తనిఖీ చేశారు. అంబాల ఎస్సీ హాస్టల్‌లో కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మించాలని తక్షణమే ముగ్గు పోశారు. ఉప్పులపల్లిలో కంది సంపత్ అనే రైతు సాగు చేసిన డ్రాగన్‌ఫ్రూట్ తోటను పరిశీలించారు. ఉపాధి హామీ, ఉద్యానశాఖ ద్వారా ఆ రైతుకు సహాయం చేయాలన్నారు.

మెమోలతోనే సరి!

- స్టాఫ్‌నర్సు, వైద్యుల నియామకాల్లో అక్రమాలు
- బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం
- నల్లబెల్లి పీహెచ్‌సీకి జూనియర్ అసిస్టెంట్ బదిలీ
- మరో ఇద్దరికి మెమోలతో సరిపెట్టారని ఆరోపణలు



సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లాలో స్టాఫ్‌నర్సు పోస్టులు, పల్లె దవాఖాన డాక్టర్ల నియామకాల్లో గోల్‌మాల్ జరిగిందని స్పష్టమైనా.. చర్యల విషయంలో అనుకున్నంత వేగిరం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద చర్యలు తీసుకునేందుకు ఉపక్రమించగా.. సదరు అధికారులు ఆమెపై ముఖ్యుల నుంచి ఒత్తిడి తీసుకువచ్చారని జిల్లా వైద్య విభాగంలో జోరుగా చర్చ జరుగుతోంది. జూనియర్ అసిస్టెంట్ పృథ్వీని జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయం నుంచి నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేయగా.. మరో ఇద్దరు అధికారులకు మెమోలు ఇచ్చారని తెలిసింది. రోస్టర్ పద్ధతిలో బీసీ–ఏ, బీసీ–బీ ఇలా అటు ఇటు మార్చి మెరిట్ వచ్చేలా చూసి ఉద్యోగం ఇచ్చే ప్రయత్నం చేసిన ఈ ఘటనలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను టర్మినేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించినా కూడా ఆ దిశగా ఇంకా చర్యలు తీసుకోలేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై అక్కడి అధికారులు మాట్లాడేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇంకోవైపు ఉద్యోగార్థుల జీవితంతో ఆటలాడిన ఈ అధికారులు తమ కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనన్న భయంతో కొందరు ముఖ్యుల నుంచి ఒత్తిడి తెచ్చి మెమోలతోనే సరిపట్టేలా చేశారన్న టాక్ ఉంది. మాకేం కాదు.. మమ్ములను ఎవరు ఏం చేయరంటూ వారు దర్జాగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో తిరగడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

కీలక అధికారి విధులకు గైర్హాజరు

బీఎస్సీ నర్సింగ్ అర్హత ఉన్న 15 స్టాఫ్‌నర్సు, ఎంబీబీఎస్ అర్హత ఉన్న ఆరు పల్లె దవాఖాన డాక్టర్ పోస్టుల విషయంలో కీలకంగా వ్యవహరించాల్సింది సదరు వైద్య విభాగం ఉన్నతాధికారే. ఆ తర్వాత ఆఫీస్ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్లు. రోస్టర్ పద్ధతిలో కంప్యూటర్‌లో డాటా తప్పుగా నమోదు చేయడంతోనే ఇదంతా జరిగిందని, అసలైన వారు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. పరిశీలించి తర్వాతే కీలక అధికారులు నియామకాలకు మెరిట్ లిస్టులో ఉన్నవారిని పిలవాలి. డాటా ఎంట్రీ ఆపరేటర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తప్పుచేశాడని, అతడిపై మాత్రమే చర్యలు తీసుకునే విధంగా కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించారని పలువురు పేర్కొంటున్నారు. ఈ పోస్టింగ్‌ల విషయంలో కీలకంగా ఉన్న ఓ అధికారి మూడు రోజుల నుంచి కార్యాలయంలో విధులకు హాజరుకావడం లేదన్న విమర్శలొస్తున్నాయి. ఓ అధికారిని నల్లబెల్లి పీహెచ్‌సీకి బదిలీ చేయడమేంటి అని, నియామకాల విషయంలో నిబంధనలను అతిక్రమిస్తే సస్పెండ్ చేయాలని వైద్య విభాగంలో చర్చ జరుగుతోంది. కలెక్టర్ సత్య శారద లోతుగా విచారించి బాధ్యులైన అధికారులపై చర్య తీసుకోవాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

ఆరోగ్య సేవలో 'ఆశ'లది ప్రత్యేక స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

ఎంజీఎం: ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలు గొప్పవని, కోవిడ్ సమయంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు అందించిన సేవలు మరువలేనివని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ కొనియాడారు. ఐఎంఏ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో ఏడు పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఒక్కో కుటుంబ సంక్షేమ కేంద్రం పరిధిలో 99 మంది ఆశ కార్యకర్తలు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో వారిపై పనిభారం పడుతున్నా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారని ప్రశంసించారు. ప్రజా ప్రభుత్వంలో, ప్రజారోగ్యంలో పనిచేసే వారికి ప్రత్యేక గుర్తింపు, సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో అర్హులైన ఏఎన్‌ఎంలు, ఆశలకు అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ లలితాదేవి, స్థానిక కార్పొరేటర్ దేవరకొండ సురేందర్‌విజయలక్ష్మి, వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధిక్కార పతాక ప్రజాకవి కలేకూరి ప్రసాద్



నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

హన్మకొండ: ప్రజాకవి కలేకూరి ప్రసాద్ ధిక్కార పతాక అని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ కొనియాడారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో కలేకూరి ప్రసాద్ జయంతిని శుక్రవారం జరుపుకున్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ నా కోసం కన్నీరు కార్చకండి.. మీకు చేతనైతే నగరం నడి బొడ్డున నన్ను ఖననం చేయండి అని ప్రకటించిన కవి ప్రసాద్ అని గుర్తుచేశారు. దోపిడీ, పీడన అణచివేతలపై తన కలం ద్వారా అనేక పాటలు రాసి ప్రజా చైతన్యానికి, తద్వారా సమాజ మార్పు కోసం పాటుపడ్డారని తెలిపారు. భారత నాస్తిక సమాజం జాతీయ నాయకుడు జీడీ.సారయ్య మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం గొంతెత్తిన కవి ప్రసాద్ అని అన్నారు. కలేకూరి ప్రసాద్ రాసిన కర్మభూమిలో పూసిన ఓ పువ్వా అనే పాట మహిళా లోకాన్ని కదిలించిందన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్, గాయకులు రామంచ భరత్, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుబాషి సంజీవ్, నాయకులు కొమ్ముల కర్ణాకర్, మేకల అనిత, భాగ్య, వేణు, పులి నవీన్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీకాంత్

మామునూరు: విద్యార్థి దశ నుంచే సామాజిక విలువలు, హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఇన్‌స్పెక్టర్ రమేష్ సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మామునూరు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్సైలు కృష్ణవేణి, శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీఐ హాజరై ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకున్నట్లయితే నేరాల సంఖ్య తగ్గుతుందని అన్నారు. చదువుతోనే గుర్తింపు వస్తుందని, అందుకోసం ప్రతివిద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో కష్టపడి చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. అనంతరం పలు రకాల ఆయుధాలను ప్రదర్శించారు. వాటి పనితీరు, చట్టాలు, కేసులు, రికార్డులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జ్యోతిరావు బాపూలే గురుకుల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు విద్యార్థినుల కృతజ్ఞతలు



వరంగల్: మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు జన్మదినం సందర్భంగా ఆంధ్ర బాలిక పాఠశాల విద్యార్థినులకు కాంగ్రెస్ నాయకుడు మడిపల్లి కృష్ణగౌడ్ సైకిళ్లను అందించారు. ఈమేరకు లబ్ధిపొందిన విద్యార్థినులు మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఓసిటీలోని క్యాంపు కార్యాలయానికి వచ్చి మంత్రికి శుక్రవారం స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి మంత్రి సురేఖ సైకిల్ తొక్కి సందడి చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో వినతులు స్వీకరించారు. అనంతరం తను మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తన కాన్వాయ్‌కు పైలట్‌గా వ్యవహరించిన మహిళా ఏఎస్సై పదవీవిరమణ చేయగా మట్వాడ పోలీస్ సిబ్బందితో కలిసి ఆమెను మంత్రి సత్కరించారు.

సమస్యల పరిష్కారానికి సీఎం సుముఖం



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించడం ఆయనకు ఉద్యోగులపై ఉన్న ప్రేమకు నిదర్శనమని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో శుక్రవారం రాత్రి జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో రాజేందర్ మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుకు అంగీకరించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, శ్యాంసుందర్, సారంగపాణి, రాజేష్ ఖన్నా, రాజేశ్వర్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: హాస్టల్ వసతి కల్పించాలని హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ లా కళాశాల విద్యార్థులు కోరారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ హాస్టల్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్.రాజ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తాము ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఐదేళ్ల లా కోర్సులో ప్రవేశాలు పొందినట్లు పేర్కొన్నారు. తమకు కేవలం మెస్ సౌకర్యం మాత్రమే యూనివర్సిటీ లా హాస్టల్‌లో అందిస్తున్నారని తెలిపారు. ఈక్రమంలో అద్దె రూముల్లో ఉంటూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. గణపతిదేవ బ్లాక్ –1 హాస్టళ్లకు మరమ్మతుల చేస్తే 100 నుంచి 150 మంది వరకు విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల విద్యార్థులు స్టాలిన్, ఆదిత్య, శ్రీను, జీతన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కేయూ వీసీకి సన్మానం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మానవతారాయ్, కన్వీనర్ మేడారపు సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి నరేష్, బాధ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించారు. కేయూ నిరుద్యోగ జేఏసీ ఇన్‌చార్జ్ అభిరామ్, కేయూ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు గుండేటి సుమన్, బాధ్యులు నాగరాజు, దుర్గం వినోద్, హేమంత్ పాల్గొన్నారు.

విదేశీ విద్యకు చేయూతనిస్తాం



అటానమస్ గ్లోబల్ మీట్‌లో మాట్లాడుతున్న డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు

హసన్‌పర్తి: విదేశాల్లో చదవడానికి వెళ్లే విద్యార్థులకు చేయూతనిస్తామని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. భీమారంలోని ఎస్‌వీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో అటానమస్ గ్లోబల్ మీట్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నెక్ట్ స్టెప్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తిరుమల్‌రావు మాట్లాడారు. నెక్ట్ స్టెప్ సంస్థతో ఎస్‌వీఎస్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. ఎస్‌వీఎస్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ప్లేస్‌మెంట్లు ఇప్పిస్తామని పేర్కొన్నారు. అటానమస్ గ్లోబల్ మీట్ కార్యక్రమం జిల్లాలో నిర్వహించడం శుభపరిణామంగా అభివర్ణించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. నెక్ట్ స్టెప్ మేనేజింగ్ డైరెక్టర్ నిషితరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత చదువులకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. విద్య రుణాలు ఎలా పొందాలో వివరించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ పాలకుర్తి శ్రీకాంత్, మార్కెటింగ్ మేనేజర్ అనుష గుప్త, శశిధర్‌రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రిటైర్డ్ ఉద్యోగులకు మళ్లీ ఉద్యోగాలు ఇవ్వొద్దు



వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కాజీపేట రూరల్: రైల్వే శాఖలో పనిచేసి రిటైర్డ్ అయిన రైల్వే ఉద్యోగులకు మళ్లీ అవకాశం కల్పించొద్దని డీవైఎఫ్ఐ నాయకులు సూచించారు. కాంట్రాక్ట్ పద్ధతిన వారికి మళ్లీ ఉద్యోగాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ శ్రీనివాసరావుకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైల్వే రంగంలో వివిధ రైల్వే జోన్‌లో ఖాళీగా ఉన్న 25 వేల ఉద్యోగాల పోస్టులను భర్తీ చేసేందుకు రైల్వే బోర్డు 65 ఏళ్ల లోపు వయస్సు గల రిటైర్డ్ అయిన ఉద్యోగులను సూపర్‌వైజర్లు, ట్రాక్‌మెన్లుగా తీసుకోవాలని అనుకోవడం సరైంది కాదని అన్నారు. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, సహాయ కార్యదర్శి చిరంజీవి, ప్రజా సంఘ నాయకులు జంపాల రమేష్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రామన్నపేట: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద మీసేవా కేంద్రం పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు మట్టెవాడ సీఐ తుమ్మ గోపి ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడు సుమారు 50 ఏళ్ల వయస్సు ఉండి, ఆరంజ్ రంగు టీషర్ట్, బూడిద రంగు నైట్ పాయింట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిస్తే 87126 85005, 87126 85117 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



విద్యారణ్యపురి: మాట్లాడుతున్న సోమశేఖర్

విద్యారణ్యపురి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ అన్నారు. హనుమకొండలోని హంటర్‌రోడ్డులోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చే ఏడాది మార్చిలో జరగబోతున్నాయని తెలిపారు. మరోసారి నర్సిరెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.రవీందర్‌రాజు, పెండెం రాజు, జిల్లా కోశాధికారి కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు సీఎస్ఆర్ మల్లిక్, శశిధర్‌రెడ్డి, మోజెస్, చంద్రయ్య, సదానందం పాల్గొన్నారు.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..

కేయూ క్యాంపస్: తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ బలపర్చిన వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి దొడ్డ వెంకటస్వామి హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. పాత పింఛన్ సాధనే లక్ష్యంగా పోరాడుతున్న తనను ఎమ్మెల్సీగా గెలిపించాలని అభ్యర్థించారు. యూనియన్ కార్యదర్శి అఫ్జల్, అధ్యాపకులు డాక్టర్ తిరుణహరిశేషు, డాక్టర్ జూల సత్య, డాక్టర్ చింతం ప్రవీణ్, డాక్టర్ కుమార్, డాక్టర్ రవీందర్, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

క్వారీ మిషన్ ఆపరేటర్ మృతి

ఐనవోలు : బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందిన సంఘటన మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని వీరాంజనేయ క్వారీలో మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సుబోద్ యాదవ్ (36) రోజు మాదిరిగా శుక్రవారం క్వారీలో స్టోన్ కటింగ్ చేస్తుండగా కాలు జారి పైనుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో బలమైన గాయాలు కాగా, హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

ఉచిత వైద్య శిబిరాలకు స్పందన



ఖిలా వరంగల్: వైద్య పరీక్షలు చేస్తున్న ఈశ్వర్



ఆరోగ్య సలహాలు ఇస్తున్న అశోక్‌కుమార్

ఖిలా వరంగల్: పడమరకోట జంక్షన్ అమరవీరుల ప్రాంగణంలో ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి, అనంతలక్ష్మి ప్రభుత్వ వైద్య కళాశాల, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యఅతిథిగా వైద్యాధికారి డాక్టర్ జగన్మోహన్ హాజరై కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల జిల్లా అధ్యక్షుడు కె.మల్లారెడ్డి, డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ శ్రవణ్, సర్జన్లు, డాక్టర్ భరత్, శ్రీహర్ష, డాక్టర్ స్పందన, అయేషా, అంజలి, భాగ్యలక్ష్మి, రమేష్, దయాకర్, అజ్గర్ పాషా, నీల, రాధాకృష్ణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గిర్మాజీపేటలోని పాఠశాలలో..

కాశిబుగ్గ: ఆయుర్వేద దినోత్సంలో భాగంగా వరంగల్ గిర్మాజీపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, బోధన వైద్యశాలల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసి ఆరోగ్య సలహాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌కుమార్, వైద్యురాలు జి.కవిత, నేషనల్ ఆయుష్ మిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రవణ్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

దేశాయిపేట: ప్రమాదవశాత్తు కాలు విరిగి అనారోగ్యానికి గురైన గిర్మాజీపేటకు చెందిన బీజేపీ కార్యకర్త గుజ్జుల శ్రీధర్, రైలు ప్రమాదంలో గాయపడిన కార్యకర్త గంజి శ్రీధర్‌ను తూర్పు బీజేపీ నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ శుక్రవారం పరామర్శించి, వాక్ ఫౌండేషన్ పక్షాన ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్నాల అరవింద్‌కుమార్ (వీఏకే) స్థాపించిన ఫౌండేషన్ ద్వారా సమైక్య వ్యాక్ ఫౌండేషన్ ద్వారా సుమారు 700లకు పైగా కుటుంబాలకు నెలకు 10కిలోల చొప్పున బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. అనాథ పిల్లల చదువులకు ఆర్థిక సహాయం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నోట్ బుక్స్ పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు అపురూప సాయిరాం, గోవిందసింగ్, సాగర్, నాగార్జున, సంతోష్, సాయి, రాజేష్, లడ్డు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడాలి



కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలపై పోరాడాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు కోరారు. కాకతీయ యూనివర్సిటీలో మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఏబీవీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వ్యక్తి నిర్మాణం ద్వారానే జాతీయ పునర్‌నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, రాష్ట్ర కార్యదర్శి అంబాల కిరణ్, యూనివర్సిటీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, నాయకులు చట్ల సతీష్, గట్టు ప్రశాంత్, ప్రణయ్, రాజు, సాయి, మణికంఠ, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రావు, సంపత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.